క్లుప్తంగా

29 వరకు పుస్తక ప్రదర్శన పొడిగింపు

విజయవాడకల్చరల్‌: విజయవాడ బుక్‌ ఫెస్టివల్‌ సొసైటీ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా గవర్నర్‌పేటలోని సొసైటీ కార్యాలయంలో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శనను పాఠకుల కోరిక మేరకు ఈనెల 29వ తేదీ వరకు పొడిగించినట్లు సొసైటీ గౌరవ అధ్యక్షుడు బెల్లపు బాబ్జీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

నేత్ర సమస్యలపై శ్రద్ధ చూపాలి


డాక్టర్‌ శ్రావణి

వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నేత్ర సమస్యలపై శ్రద్ధ చూపాలని అగర్వాల్‌ కంటి ఆస్పత్రి వైద్య నిపుణురాలు డాక్టర్‌ శ్రావణి అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్స్‌ ఆధ్వర్యంలో 'ఐ ప్రొటెక్షన్‌ అండ్‌ కేరింగ్‌' అంశంపై సదస్సును మంగళవారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ శ్రావణి మాట్లాడుతూ ఇటీవల వయస్సు, జన్యుపరమైన, పర్యావరణ పరమైన అనేక కారణాలు నేత్ర సమస్యలకు కారణమవుతాయన్నారు. కంప్యూటర్‌, సెల్‌ ఫోన్‌ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కంటిపైన ఒత్తిడి పెరిగి సమస్యలు పెరుగుతున్నాయన్నారు. కంటి సమస్యలపై అవగాహన పెంచుకోవటం వలన వాటికి దూరంగా ఉండవచ్చని చెప్పారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జే.లక్ష్మీనారాయణ, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పతంజలిశాస్త్రి, ఎన్‌ఎస్‌ఎస్‌ ఆఫీసర్‌ బి.శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్‌ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళా సాధికారతలో భాగంగా స్వయం ఉపాధి పొందేందుకు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్‌ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ స్టేట్‌ టైలరింగ్‌ అసోసియేషన్‌ చైర్‌పర్సన్‌ సుభాన్‌బీ అన్నారు. గొల్లపూడి మౌలానగర్‌లోని ఆయేషా టైలరింగ్‌ సెంటర్‌లో శిక్షణ పొందిన మహిళలకు ఆమె మంగళవారం బహుమతులను అందజేశారు. స్థానిక వైఎస్సార్‌ సీపీ నాయకుడు, సామాజిక సేవకులు ఆలపాటి సుబ్బారావు సౌజన్యంతో అసోసియేషన్‌ గొల్లపూడి శాఖ అధ్యక్షుడు టైలర్‌ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుభాన్‌బీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఒకరిపై ఆధారపడకుండా టైలరింగ్‌ నేర్చుకోవడం ద్వారా కుటుంబాన్ని పోషించుకోవచ్చన్నారు. ఆలపాటి సుబ్బారావు మాట్లాడుతూ.. మహిళలకు కుట్టు మిషన్లు అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. అసోసియేషన్‌ సభ్యులు, మహిళా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పోలవరం కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

పాతపాడు(విజయవాడరూరల్‌): పాతపాడు గ్రామ శివారు మంగళాపురం గ్రామంలోని పోలవరం కాల్వలో గుర్తు తెలియని మృతదేహాన్ని మంగళవారం గుర్తించినట్లు స్థానిక వీఆర్వో పోతిన రఘుబాబు తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో మృతదేహాన్ని వెలికితీశామన్నారు. మృతదేహం ఆనవాళ్లు కూడా లేకుండా కుళ్లిపోయిందన్నారు. వీఆర్వో ఇచ్చిన రిపోర్టు ఆధారంగా గుర్తు తెలియని శవంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య, పిల్లల అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): తన భార్య, ఇద్దరు పిల్లలు కనిపించడం లేదంటూ ఊర్మిళానగర్‌కు చెందిన కొయ్యా రమేష్‌ భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... ఊర్మిళానగర్‌కు చెందిన రమేష్‌ ముఠా కూలీగా పని చేస్తున్నాడు. అతనికి భార్య బాలమ్మ, కూతురు హర్షిత, కుమారుడు హేమ చరణ్‌ ఉన్నారు. హర్షిత(5వ తరగతి), హేమ చరణ్‌ (3వ తరగతి) చదువుతున్నారు. ఈనెల 20వ తేదీ ఆదివారం రమేష్‌ బాగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. దీంతో దంపతుల మధ్య గొడవ జరిగింది. ఆ తర్వాత రమేష్‌ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి వచ్చి చూడగా భార్య బాలమ్మ, ఇద్దరు పిల్లలు కనిపించలేదు. అత్తింట్లో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీనిపై రమేష్‌ పోలీసులకు ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీ

మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): 31వ డివిజన్‌లో ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే విష్ణు ఆదేశాలతో మంగళవారం కుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వైఎస్సార్‌ సీపీ డివిజన్‌ ఇన్‌చార్జి పెనుమత్స సత్యం సచివాలయం సిబ్బందితో కలిసి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

పర్యాటకులను ఆకర్షించేలా అంబేడ్కర్‌ స్మృతివనం

వీఎంసీ కమిషనర్‌ స్వప్నిల్‌ దినకర్‌ పుండ్కర్‌


స్మృతివనం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్‌ స్వప్నిల్‌ దినకర్‌ పుండ్కర్‌

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్‌ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో స్పెషల్‌ చీఫ్‌ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా అంబేడ్కర్‌ స్మృతివనం పనులు చేపడుతున్నట్లు వీఎంసీ కమిషనర్‌ స్వప్నిల్‌ దినకర్‌ పుండ్కర్‌ పేర్కొన్నారు. నగరంలోని స్వరాజ్‌ మైదానంలో నిర్మాణంలో ఉన్న డాక్టర్‌ బాబాసాహెబ్‌ అంబేడ్కర్‌ విగ్రహ స్మృతివనం నిర్మాణ పనులను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. స్మృతివనం పనులను సీఎం వైఎస్‌ జగన్‌, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ పలు సూచనలు చేస్తున్నారన్నారు. డిజిటల్‌ మ్యూజియం, మినీ థియేటర్‌ నిర్మాణపు పనులు దాదాపు పూర్తయ్యాయని, లైటింగ్‌, గ్రానైట్‌, పాత్‌ వే, వాటర్‌ ఫౌంటెన్‌, వెహికల్‌ పార్కింగ్‌, ఎలక్ట్రిసిటీ, ల్యాండ్‌ స్కేపింగ్‌, గ్రీనరీ సుందరీకరణ తదితర పనులను మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. నిర్మాణ పనులను రానున్న రెండు నెలల్లో పూర్తిచేసి ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్‌ తెలిపారు. పనులు పరిశీలించిన వారిలో ఏపీఐఐసీ చీఫ్‌ ఇంజినీర్‌ నరసింహారావు, జోనల్‌ మేనేజర్‌ సీతారాం, డెప్యూటీ జోనల్‌ మేనేజర్‌ రహీమ్‌, కేపీసీ ప్రాజెక్టు డైరెక్టర్‌ పి.వాసుదేవరావు, ప్రాజెక్ట్‌ మేనేజర్లు కె.కృష్ణమోహన్‌, జావీద్‌ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలందించాలి

కలెక్టర్‌ ఢిల్లీరావు


కలెక్టర్‌ ఢిల్లీరావుకు మొక్కను అందజేస్తున్న ఆరోగ్య శ్రీ ట్రస్ట్‌ కో ఆర్డినేటర్‌ సుమన్‌

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ హెల్త్‌ కేర్‌ ట్రస్ట్‌ ద్వారా పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు తెలిపారు. ఎన్టీఆర్‌ జిల్లా కో–ఆర్డినేటర్‌గా నియమితులైన డాక్టర్‌ జె.సుమన్‌ మంగళవారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ ఢిల్లీరావు మాట్లాడుతూ.. జిల్లాల పునఃవ్యవస్థీకరణకు పూర్వం ఉన్న కృష్ణాజిల్లా కో–ఆర్డినేటర్‌కు విభజన అనంతరం ఏర్పడిన ఎన్టీఆర్‌ జిల్లా బాధ్యతను అప్పగించారన్నారు. వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ హెల్త్‌ కేర్‌ ట్రస్ట్‌ ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రెండు జిల్లాలకు వేర్వేరుగా కో– ఆర్డినేటర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఎన్టీఆర్‌ జిల్లాలో మాత్రమే విధులు నిర్వర్తించడం వలన పని ఒత్తిడి తగ్గి ఆరోగ్యశ్రీ వైద్య సేవలపై మరింత దృష్టి పెట్టే అవకాశం కలుగుతుందన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు తక్షణమే అందించేందుకు కృషి చేసి ప్రభుత్వం ఆశించే లక్ష్యాలను నెరవేర్చాలని సూచించారు.

పీఎం స్వనిధికి 1,042 మంది ఎంపిక


రుణాల ప్రక్రియను పరిశీలిస్తున్న వీఎంసీ అధికారి శకుంతల

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో వీధి విక్రయదారులు వ్యాపారం మెరుగుపరచుకోవటానికి పీఎం స్వనిధి పథకం ద్వారా బ్యాంకుల ద్వారా రుణాల మంజూరుకు క్రెడిట్‌ క్యాంప్‌లో 1,042 మంది ఎంపికయ్యారు. వీఎంసీ పట్టణాభివృద్ధి సాధికారక విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ క్యాంప్‌లో మొత్తం 1,223 దరఖాస్తులు రాగా అందులో 1,042 మందిని ఎంపిక చేశామని ప్రాజెక్ట్‌ అధికారి శకుంతల తెలిపారు. సర్కిల్‌–1 పరిధిలో విద్యాధరపురంలో యూనియన్‌ బ్యాంక్‌ వద్ద ఉన్న 117వ సచివాలయంలో జరిగిన క్రెడిట్‌ క్యాంప్‌లో 324 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 306 మంది ఎంపికయ్యారన్నారు. సర్కిల్‌–2 పరిధిలో గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌ వద్ద జరిగిన కార్యక్రమంలో 546 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 472 మంది రుణాలకు అర్హత సాధించారన్నారు. సర్కిల్‌–3 పరిధిలో కృష్ణలంక శాంపిల్‌ బిల్డింగ్‌లోని 79వ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో 353 మంది రాగా అందులో 264 మంది రుణ అర్హత పొందారని చెప్పారు.

దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్‌ భాగ్యలక్ష్మి, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వీఎంసీ మేయర్‌ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయం సమీపంలోని సీతమ్మ పాదాల వద్ద 'నా భూమి – నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం స్వాతంత్య్ర సమరయోధులకు దేశాన్ని రక్షించే సైనికుల త్యాగాలకు కృతజ్ఞతలు తెలుపుతూ మేయర్‌ భాగ్యలక్ష్మి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్‌ మొక్కలు నాటి 2047 నాటికి దేశం పర్యావరణ రహితంగా, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమె వీఎంసీ ఉద్యోగులకు మొక్కలను పంపిణీ చేసి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అడిషనల్‌ కమిషనర్‌ కె.వి.సత్యవతి, ఏడీహెచ్‌ శ్రీనివాస్‌, ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ ఏఎస్‌ఎన్‌ ప్రసాద్‌, మేనేజర్‌ శ్రీనివాస్‌, పబ్లిక్‌ రిలేషన్‌షిప్‌ ఆఫీసర్‌ రజియా షబీనా, మున్సిపల్‌ అధికారులు పాల్గొన్నారు.

అధికారం ఇస్తే ఉద్ధరిస్తామంటూ లోకేష్‌ కొత్త డ్రామా

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ చైర్మన్‌ శ్రీకాంత్‌

భవానీపురం(విజయవాడపశ్చిమ): చంద్రబాబు హయాంలో చేతి వృత్తిదారులను పట్టించుకోకుండా శిక్షణ ఇవ్వాల్సిన స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ సొమ్ములో కోట్లాది రూపాయలను దోచుకుని నాసిరకం పనిముట్లు ఇచ్చి మోసం చేశారని, ఇప్పుడు లోకేష్‌ బీసీలతో ముఖాముఖి అంటూ కొత్త డ్రామాకు తెర తీశారని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ చైర్మన్‌ తోలేటి శ్రీకాంత్‌ ఒక ప్రకటనలో విమర్శించారు. యువగళం పేరుతో లోకేష్‌ చేసే సాయంత్రపు నడక యాత్రలో బీసీలు, చేతి వృత్తిదారులతో ముఖాముఖి సమావేశాలంటూ హడావుడి చేయటం అంతా బూటకమని పేర్కొన్నారు. అధికారం ఇస్తే ఉద్ధరిస్తామనటం హాస్యాస్పదంగా ఉందని, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన నీ తండ్రి చంద్రబాబు బీసీలకు ఎందుకు పదవులు ఇవ్వలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేతి వృత్తులు చేసేవారికి 'జగనన్న చేదోడు' పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. దాదాపు 139 బీసీ కులాలను గుర్తించి వాటికి కార్పొరేషన్లు ఏర్పాటు చేయటమే కాకుండా ప్రభుత్వంలో వారిని భాగస్వాములను చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. మంత్రి మండలిలో 65 శాతం బీసీలకు ఇచ్చారని, నలుగురిని రాజ్యసభకు పంపించారని గుర్తు చేశారు. బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకున్న టీడీపీని ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. లోకేష్‌ తన పాదయాత్రలో ప్రజలు లేకపోవడంతో దారి పొడవున బజ్జీలు, పకోడీలు తింటూ అక్కడున్న వారిని బతిమలాడుకుని సెల్ఫీలు తీసుకుంటూ రోజులు గడిపేస్తున్నారని ఎద్దేవా చేశారు.

మత్తు పదార్థాలతో జీవితం దుర్భరం చేసుకోవద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శేఖర్‌బాబు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మత్తు పదార్థాలతో జీవితం దుర్భరం చేసుకోవద్దని, ఎటువంటి మత్తు పదార్థాలు తీసుకున్న అవి ప్రాణంతకమేనని నవజీవన్‌ బాలభవన్‌ ప్రోగ్రామ్‌ మేనేజర్‌ గోళ్లమూడి శేఖర్‌బాబు విద్యార్థులకు సూచించారు. కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ పాఠశాలలో విద్యార్థులకు నవజీవన్‌ బాలభవన్‌ ఆధ్వర్యంలో మంగళవారం మత్తు పదార్థాల దుర్వినియోగంపై ప్రాజెక్టర్‌ ద్వారా అవగాహన కల్పించారు.

అనారోగ్య సమస్యలు..

ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు సేవించడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. స్నేహితులు, మరే ఇతర వ్యక్తులు మాదక ద్రవ్యాలపై ప్రలోభపెడితే తిరస్కరించాలన్నారు. ఒకరి నుంచి ఒకరు చెడు అలవాట్లకు అలవాటు పడి తీవ్ర ప్రమాదస్థాయికి చేరుకుంటారన్నారని, క్యాన్సర్‌, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మత్తుకు బానిసలైన వారిని డీ–ఎడిక్షన్‌ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు., ఈ చికిత్సా కేంద్రాన్ని నవజీవన్‌ బాలభవన్‌ సంస్థ ఆధ్వర్యంలో నూజివీడులో బోస్కో డీ–ఎడిక్షన్‌ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. వ్యసనానికి బానిసలైన విద్యార్థులు, యువతకు విముక్తి కలిగించేందుకు డాన్‌ బాస్కో నవజీవన్‌ బాలభవన్‌ ఆధ్వర్యంలో పెజ్జోనిపేటలో ఏర్పాటు చేసిన నీ తోడు మానసిక వికాస కేంద్రాన్ని ఉచితంగా సంప్రదించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 94904 92020 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌.రమేష్‌ మాట్లాడుతూ.. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నవజీవన్‌ బాలభవన్‌ జోనల్‌ కో ఆర్డినేటర్‌ షేక్‌ నజ్మా, ఉపాధ్యాయులు ఎం.వరలక్ష్మి, అరవింద్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బ్లడ్‌ బ్యాంకులు నిర్వహించాలి


బ్లడ్‌ బ్యాంక్‌లో తనిఖీలు చేస్తున్న అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ ఉషారాణి

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య అవసరాలకు అనుగుణంగా రక్త నిల్వలు అందుబాటులో ఉంచుతూ, పారదర్శకంగా బ్లడ్‌ బ్యాంకులను నిర్వహించాలని అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ జూపూడి ఉషారాణి ఆదేశించారు. సీతారామపురంలోని రెయిన్‌బో బ్లడ్‌ బ్యాంకును మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్లడ్‌ బ్యాంకులో అందిస్తున్న సేవలు, రక్తనిల్వలు, రక్తదాతల వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదాన శిబిరాల్లో సేకరించిన యూనిట్‌లలో 30 శాతం యూనిట్‌లు ప్రభుత్వ బ్లడ్‌ బ్యాంకులకు విధిగా అందజేయాలని సూచించారు. సీజనల్‌ వ్యాధులకు అవసరమైన ప్లేట్‌లెట్స్‌ను సిద్ధంగా ఉంచాలని, ప్రభుత్వం నిర్దేశించిన ధరకే వాటిని ఇవ్వాలన్నారు. రక్తదానం చేసిన వారిలో హెచ్‌ఐవీ, హెపటైటీస్‌ బి, హెచ్‌సీవీ పాజిటివ్‌లు ఉన్నట్లు గుర్తిస్తే ఆ సమాచారాన్ని సమీపంలోని ఐసీటీసీ సెంటర్‌లకు, గ్యాస్ట్రో విభాగాలకు అందించాలని ఆమె సూచించారు. తనిఖీల్లో జిల్లా ప్రోగ్రామ్‌ మేనేజర్‌ కిరణ్‌ పందిటి, బ్లడ్‌ బ్యాంక్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ కె.లక్ష్మి పాల్గొన్నారు.

న్యాయ సేవా శిబిరం ఏర్పాట్ల పరిశీలన

నందిగామ: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా పరిపాలన యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించనున్న న్యాయ సేవా శిబిర ఏర్పాట్లను మంగళవారం పలువురు న్యాయమూర్తులతో కలసి రెవెన్యూ అధికారులు పరిశీలించారు. నెహ్రూనగర్‌లో గల కమ్మ కల్యాణ మండపంలో ఈనెల 26న ఉదయం 8:30 గంటలకు నూతన తరహా న్యాయ సేవా శిబిరం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు తదితర అంశాలపై న్యాయమూర్తులు ఆర్డీవో రవీంద్రరావుతో చర్చించారు. పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా న్యా య సేవాధికార సంస్థ, పరిపాలన యంత్రాంగం, పోలీస్‌ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నూతన తరహా న్యాయ సేవల శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు రకాల స్కీములకు సంబంధించి ప్రత్యేక స్టాల్స్‌ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని న్యాయమూర్తి శ్రీనివాసరావు సూచించారు. న్యాయమూర్తులు లక్ష్మీ రాజ్యం, షేక్‌ రియాజ్‌, తహసీల్దార్లు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్‌: హిమబిందు సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్‌ కౌతా పూర్ణానందం కళావేదికపై మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. నగరానికి చెందిన గాయనీ గాయకులు కంచి మల్లీశ్వరి, రంజిత, పద్మావతి, జ్యోతిర్మయి, రేష్మ, సత్య, పి.శ్రీనివాసరావు తదితరులు చిరంజీవి నటించిన చిత్రాల్లోని గీతాలను ఆలపించారు. హిమబిందు సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకురాలు మల్లీశ్వరి మాట్లాడుతూ.. చిరంజీవి సామాజిక సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విశ్రాంత పోలీస్‌ అధికారి డేవిడ్‌రాజు చిరంజీవి సినీ జీవిత విశేషాలను వివరించారు.

ఎక్సెల్‌ ప్లాంట్‌లో పనులు వేగవంతం చేయాలి


సిబ్బందికి సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్‌ స్వప్నిల్‌ దినకర్‌ పుండ్కర్‌

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌ సింగ్‌నగర్‌లోని ఎక్సెల్‌ ప్లాంట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ స్వప్నిల్‌ దినకర్‌ పుండ్కర్‌ ఆదేశించారు. మంగళవారం ఆయన ప్లాంట్‌ను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇన్స్పిరేషన్‌ పార్క్‌ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అక్టోబర్‌ 2వ తేదీన పార్క్‌ను ప్రారంభించాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంట్రన్స్‌ గేటు దగ్గర ఏర్పాటు చేసిన కర్బ్‌ వాల్‌ను పరిశీలించి ఎక్కువగా ఉన్న రాళ్లను అక్కడి నుంచి తొలగించి ఆ ప్రదేశంలో మొక్కలను నాటాలని ఉద్యానవన అధికారులకు సూచించారు. ఎక్సెల్‌ ప్లాంట్‌కు రోజు వచ్చే చెత్త వివరాలను కంప్యూటర్‌లో తనిఖీ చేసి, చెత్త వేయింగ్‌(వే బ్రిడ్జి) పని తీరును పర్యవేక్షించారు. ప్లాంట్‌ ఆవరణలో ఆహ్లాదకరంగా ఇండస్ట్రియల్‌ వాతావరణం కలిగి ఉండే విధంగా పూర్తి స్థాయిలో పచ్చదనం పెంపొందించే విధంగా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఉద్యానవన అధికారులకు సూచించారు.

ఈ పర్యటనలో అదనపు కమిషనర్‌(ప్రాజెక్ట్స్‌) కె.వి.సత్యవతి, డెప్యూటీ సిటీ ప్లానర్‌(ప్లానింగ్‌) జుబిన్‌ శిరన్‌ రాయ్‌, ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్లు ఏఎస్‌ఎన్‌ ప్రసాద్‌, సత్యనారాయణ, ఏడీహెచ్‌ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్‌ ఆక్వాటిక్‌ చాంపియన్‌ షిప్‌ విజేతలకు అభినందన


విజేతలను అభినందిస్తున్న మేయర్‌ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): నేషనల్‌ ఆక్వాటిక్‌ చాంపియన్‌ షిప్‌ విజేతలను నగర మేయర్‌ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్‌ స్వప్నిల్‌ దినకర్‌ పుండ్కర్‌ మంగళవారం అభినందించారు. విజయవాడ నగరపాలక సంస్థ సర్‌ విజ్జి స్విమ్మింగ్‌ పూల్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు ఒడిశా, భువనేశ్వర్‌లోని బిజు పట్నాయక్‌ స్విమ్మింగ్‌ పూల్‌లో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగిన 39వ సబ్‌ జూనియర్‌, 49వ జూనియర్‌ నేషనల్‌ ఆక్వాటిక్‌ చాంపియన్‌ షిప్‌– 2023లో గెలుపొందారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్‌, కమిషనర్లను ఎన్టీఆర్‌ జిల్లా స్విమ్మింగ్‌ అసోసియేషన్‌ సెక్రటరీ ఐ.రమేష్‌ ఆధ్వర్యంలో మెడల్స్‌ సాధించిన విద్యార్థులు మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్‌ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఈవెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున పాల్గొని మెడల్స్‌ సాధించటం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి నగరానికి మణిహారంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులను, కోచ్‌ను అభినందించారు.

గురుకుల కళాశాలలో విద్యార్థి అవగాహన కార్యక్రమం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వల్లూరు నీరజ

మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్‌ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల విద్యా కమిషనర్‌ ఆదేశాల మేరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు విద్యార్థి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వల్లూరు నీరజ కళాశాలలో నిర్వహించే తరగతులు, సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాలు, సర్టిఫికెట్‌ కోర్సులు, ఎసైన్‌మెంట్లు, విద్యార్థి సదస్సులు తదితర వివరాలను తెలియజేశారు. కళాశాలలో ఏ విధంగా ఉండాలి, ఏ విధంగా ఉండకూడదు తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థి అవగాహన కార్యక్రమం మూడు వారాల పాటు ప్రతి రోజు సాయంత్రం నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి పోటీలు...

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు తెలుగు విభాగం ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయన్నారు. క్విజ్‌, వక్తృత్వం, వ్యాసరచన, పాటల పోటీలు, ప్రాజెక్టు, పద్యపఠనం పోటీల్లో విద్యార్థులు పాల్గొని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ బాలకృష్ణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న మంజునాథ్‌, అధ్యాపకులు

గుణదల(విజయవాడతూర్పు): విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సైబర్‌ సెక్యూరిటీస్‌ సీఈవో ఎం.మంజునాథ్‌ తెలిపారు. ఆంధ్రలయోల కళాశాలలో పారిశ్రామిక వ్యవస్థపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. లక్ష్యసాధనలో అహర్నిశలు పాటుపడాలన్నారు. ఆధునిక సమాజంలో పారిశ్రామిక రంగం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా పరిశ్రమల విస్తరణలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని చెప్పారు. విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని తెలిపారు. పారిశ్రామిక రంగంలో మనుగడ సాగించే వారంతా అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే స్థితికి చేరుతారని గుర్తు చేశారు. దేశ ఆర్థిక పురోగతి పారిశ్రామికవేత్తలపై ఆధారపడి ఉంటుందన్నారు. అనంతరం పరిశ్రమల విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయోల కళాశాల అధ్యాపకులు ఆర్‌.పూర్ణిమ, ఎ.మంజుల, ఎ.లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు



రైల్వేస్టేషన్‌ పరిసరాల్లో ఫుట్‌ పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్‌ వెంకటనారాయణ, సిబ్బంది

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్‌): నగర పోలీస్‌ కమిషనర్‌ టి.కె.రాణా ఉత్తర్వుల మేరకు డీసీపీ, ఏసీపీ ఆదేశాలతో ఎస్‌ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్‌ ఎం.వెంకటనారాయణ సిబ్బందితో కలిసి మంగళవారం తమ పరిధిలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో ఫుట్‌ పెట్రోలింగ్‌ నిర్వహించి నేరాల నియంత్రణపై స్థానికులకు అవగాహన కల్పించారు. రైల్వే స్టేషన్‌ పరిసర ప్రాంతాలు, కరుణాహోటల్‌ సెంటర్‌, పూర్ణానందంపేట, లక్ష్మణరావువీధి తదితర ప్రాంతాలలో పర్యటించి పలువురు అనుమానితులను విచారించారు. నివాసాల మధ్య, ఖాళీ ప్రదేశాల్లో గంజాయి, మద్యం సేవించి అవాంఛనీయ ఘటనలకు పాల్పడే వారి వివరాలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల సమీపంలో ఎవరైన అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్‌ 100కి ఫోన్‌ చేసి సమాచారం అందజేయాలని ఆయన స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ దుర్గాభవానీ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ కారు ధ్వంసం

పెనమలూరు: కారులో ప్రయాణిస్తున్న మహిళపై వ్యాను డ్రైవర్‌ దాడి చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి వెటర్నరీ ఆస్పత్రి రోడ్డుకు చెందిన తోటకూర పద్మ తన కారులో విజయవాడ నుంచి పోరంకి బయలు దేరింది. ఆమె కారు ఆటోనగర్‌ గేటు దాటిన తరువాత వెనుక నుంచి వచ్చిన వ్యాన్‌ కారును వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో పద్మ కారు దిగి కారుకు దెబ్బ తగిలిందేమోనని చూస్తున్న సమయంలో వ్యాన్‌ డ్రైవర్‌ వచ్చి ఆమెను దూషించాడు. వ్యాన్‌ డ్రైవర్‌ వ్యాన్‌లో ఇనుప రాడ్‌ తీసుకు వచ్చి కారు అద్దాలు ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురి చేశాడు. ఈ ఘటన పై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.